సాక్షి
రంగారెడ్డి
బుధవారం | 4 | జూన్ | 2025



డీపీతో టోపీ!

దుబాయ్‌లో ఉన్న వ్యక్తి ఫొటోతో వాట్సప్ డీపీ పెట్టుకుని, అతని కుటుంబ సభ్యులతో చాటింగ్ చేసిన నేరగాళ్లు నిండా ముంచారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

రెవెన్యూ సదస్సులలోనైనా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య కోరారు. 8లో▸



మళ్లీ పోలీస్ చేతికి..

హెచ్‌ఎండీఏ మరమ్మతులు చేపట్టిన జేమ్స్ స్ట్రీట్ భవనాన్ని పోలీస్ శాఖకు అప్పగించారని నగర సీపీ ఆనంద్ వెల్లడించారు. 8లో▸



జూన్ పిడుగు

అ'ధన'పు భారం

- భయపెడుతున్న విద్యా సంవత్సరం
- తల్లిదండ్రులకు పెరిగిన ఖర్చు
- రైతులైతే అటు వ్యవసాయ పెట్టుబడులు, ఇటు విద్యా ఖర్చులు తడిసి మోపెడు

తుక్కుగూడ: నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు 'జూన్ పిడుగు' రానే వచ్చింది. ఈనెలలోనే విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడం.. రైతులు వ్యవసాయం కోసం పెట్టుబడులు పెట్టాల్సి రావడం.. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు నగరానికి దగ్గరగా వచ్చి అద్దెలకు ఉంటుండడంతో ఖర్చు తడిసి మోపెడు కానుంది. ఏడాదంతా దాచుకున్న సొమ్ము ఒక్క జూన్‌లోనే ఆవిరికానుంది. డబ్బులు లేకుంటే అప్పు చేయడం, అవసరాలకు అనుగుణంగా సమకూర్చుకోవడం కోసం ఆర్థిక స్థితిగతులపై అంచనాలు వేసుకుంటున్నారు.

విద్యకు అధిక ఖర్చు

నర్సరీ మొదలు డిగ్రీ.. ఆపై ఉన్నతస్థాయి చదువులు చదివే పిల్లలుంటే ఆ కుంటుంబానికి విద్యాపరమైన ఖర్చులు భారం కానున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివితే అడ్మిషన్ ఫీజు, ఏడాది ఫీజు, పుస్తకాలు, స్టేషనరీ, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ, ట్యూషన్ ఫీజు, లంచ్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఇలా ఖర్చులు పెరిగిపోనున్నాయి. పాఠశాల, కళాశాల ఆధారంగా అంతే పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. వసతి గృహాల్లో ఉంటే హాస్టల్ ఫీజు అదనంగా భరించాల్సిందే. విద్యా సంస్థల్లో విడతల వారీగా ఫీజు వెసులుబాటు కల్పిస్తున్నప్పటికీ పెద్ద మొత్తంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులకు సైతం నోటు బుక్స్, స్టేషనరీ, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ట్రంక్ బాక్స్, డ్రెస్‌లు, ఇతర ఖర్చులు ఉంటున్నాయి.

సాగు ఖర్చులూ ఇప్పుడే..

జూన్ నెల వచ్చిందంటే రైతులకు వ్యవసాయ పెట్టుబడులు భారం అవుతున్నాయి. రోహిణి కార్తె పూర్తికావస్తూ.. మృగశిర రానుండటంతో రైతులు వ్యవ సాయ పనులు చేపడుతున్నారు. తొలకరి వర్షాలు కురుస్తుండడంతో సాగుకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దున్నకాలు, విత్తనాలు, ఎరువులు, కూలీలు, కౌలు రైతులైతే కౌలు చెల్లించడం లాంటి ఖర్చులు ఉంటాయి. దసరా, దీపావళి అంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికి రానున్నాయి. అప్పటి వరకు రైతులు పెట్టుబడి ఖర్చులు చేయాల్సి వస్తోంది. అటు వ్యవసాయ ఖర్చులు, ఇటు పిల్లల చదువు ఖర్చులు మోయలేని భారంగా మారాయి.

అద్దె ఇళ్లకు అడ్వాన్స్‌లు

జిల్లా సరిహద్దు, లోపల అనేక విద్యా సంస్థలు ఉన్నాయి. నాణ్యమైన విద్య నగరంలో అందుతుందని తల్లిదండ్రుల విశ్వాసం. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారు జిల్లాకు రావడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొత్తగా వచ్చిన వారు ఇళ్ల అద్దెకు తీసుకోవడం, ఉన్న వారు అద్దె మారడం జరుగుతోంది. దీంతో వారిపై అద్దె అదనపు భారం పడుతోంది. జిల్లాలో అర్బన్ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో అద్దె కూడా అధికంగా ఉంటోంది.

సాగుకు పెట్టుబడి కావాలి



ప్రస్తుతం పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. వరి, కూరగాయల పంటలు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నాను. విత్తనాలు, ఎరువుల కొనుగోలు, దున్నకాలు, కూలీలకు ఇలా రూ. 2లక్షల వరకు పెట్టుబడి కావాలి.

– సియోదస్, రైతు, రావిర్యాల

పిల్లల చదువులకు అప్పు



ప్రతి సంవత్సరం బడి తలుపులు తెరుచుకుంటే చాలు భయంగా ఉంటోంది. పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, ఫీజులు తదితర ఖర్చులు ఏటా పెరిగిపోతున్నాయి. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేస్తున్నాం.

– బండ శ్రీను, ఇమామ్‌గూడ

చచ్చినా.. భూములివ్వం



ఎనికేపల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నాం
- తీసుకుంటే ఎట్లా బతకాలి
- కలెక్టర్ ముందు ఎనికేపల్లి రైతుల ఆవేదన
- న్యాయం జరిగేలా చూస్తాం: కలెక్టర్ నారాయణరెడ్డి

మొయినాబాద్: తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నాం.. ఈ భూమి తప్ప మాకు మరెక్కడా భూమి లేదు.. మా భూములు తీసుకుంటే మేం ఎట్లా బతకాలి.. చస్తే ఇక్కడే చస్తాం కానీ భూములు వదిలిపెట్టమని .. మీరే న్యాయం చేయండి.. అంటూ కలెక్టర్ నారాయణరెడ్డి ఎదుట ఎనికేపల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 180లోని 99 ఎకరాల ప్రభుత్వ భూమిని డెబ్బై ఏళ్లకు పైగా గ్రామానికి చెందిన యాభై మంది రైతులు సాగుచేసుకుంటున్నారు. ప్రభుత్వం ఆ భూమిని గోషాల ఏర్పాటుకోసం తీసుకుంటోంది. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ నారాయణరెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి ఎనికేపల్లి భూములను పరిశీలించారు. అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు ముందుగానే అక్కడికి చేరుకున్నారు. తాతల కాలం నుంచి భూమిని దున్నుకుని బతుకుతున్నామని.. 1954లో అప్పటి ప్రభుత్వం తోకపట్టాలు ఇచ్చిందని కలెక్టర్‌కు వివరించారు. అప్పటి నుంచి 1983 వరకు పన్నులు కట్టామని.. వర్షాధార పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్న తమ పొట్ట కొట్టొద్దని వేడుకున్నారు. భూములు సాగుచేసుకునేది ఎస్సీ, బీసీ కులాలకు చెందిన పేదలమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూములు తీసుకుంటే తమకు ఎలాంటి న్యాయం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

చర్చిద్దాం రండి..

ఎనికేపల్లిలో ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న రైతులతో మాట్లాడిన కలెక్టర్ నారాయణరెడ్డి రైతులకు, గ్రామానికి న్యాయం జరిగే విధంగా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ అవసరం కోసం భూమిని తీసుకుంటోందని.. ఇందులో రైతులు దున్ని, విత్తనాలు వేయొద్దని అన్నారు. బుధవారం ఆర్డీఓ చంద్రకళ రైతులతో సమావేశమై వారి సమస్యలు, డిమాండ్లపై చర్చిస్తారన్నారు. రైతులు మధ్యాహ్నం 3 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ వార్డుల ఏర్పాటుపై ముసాయిదా

మొయినాబాద్: మున్సిపాలిటీల్లో వార్డుల ఏర్పాటు, సవరణపై ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో భాగంగా మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీలో అధికారులు వార్డుల ఏర్పాటుపై కసరత్తు చేపట్టారు. ఐదు నెలల క్రితం ఎనిమిది గ్రామ పంచాయతీల విలీనంతో మొయినాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడింది. ఇటీవల మరో గ్రామ పంచాయతీ అప్పోజీగూడ విలీనమైంది. ప్రస్తుతం మున్సిపాలిటీ మొత్తం ఓటర్లు 32 వేలు కాగా 26 వార్డులుగా విభజించారు. ఒక్కోవార్డులో 1,198 నుంచి 1,323 ఓట్లు ఉండే విధంగా వార్డుల విభజన చేపడుతున్నారు. మంగళవారం ముసాయిదా ఓటరు జాబితాపై అధికారులు కసరత్తు చేశారు. ఈ నెల 4న వార్డుల విభజనపై ప్రజలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల నుంచి సూచనలు కోరుతారు. 5 నుంచి 11 వరకు ప్రజలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల నుంచి సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటారు. 12 నుంచి 16వరకు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలపై విచారించి పరిష్కరిస్తారు. 17 నుంచి 18 వరకు కలెక్టర్ ఆమోదం కోసం పంపుతారు. 19న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆమోదం, 20న ప్రభుత్వ ఆమోదం పొందిన అనంతరం 21న తుది జాబితా విడుదల చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ తెలిపారు.

మైసిగండి ఆలయానికి భారీగా ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. పూలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుతో పాటు, శాక్తేయ మొక్కుబడులు వసూలు చేసుకునే హక్కులకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు వేలం పాటలో పాల్గొనగా మైసిగండి గ్రామానికి చెందిన రాజేశ్ రూ.15,68,000 అత్యధికంగా వేలం పాడి పూలు, పూజా సామగ్రి విక్రయించే హక్కును కైవసం చేసుకున్నాడు. అనంతరం శాక్తేయ మొక్కుబడుల రసీదు వసూలుకు వేలం పాట నిర్వహించగా సరైన స్పందన రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి ప్రవీణ్, ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



చేవెళ్ల: చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్‌గా ఎ.శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ పద్ధతిని తీసుకు వచ్చిందని చెప్పారు. చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మొదటి రోజు సోమవారం 8 స్లాట్‌లు బుక్ కాగా మంగళవారం రెండో రోజు 13 స్లాట్‌లు బుక్ అయినట్లు తెలిపారు. అన్నింటికీ రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ బుకింగ్ ప్రకారం ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు సమయం ప్రకారం వస్తే వెంటనే రిజిస్ట్రేషన్ జరిగిపోతుందన్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల నిరీక్షణ

మూడు రోజులుగా అవే తిప్పలు

రేషన్ దుకాణాల వద్ద తప్పని పడిగాపులు

ఇబ్రహీంపట్నం: మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో ఈ పాస్ సర్వర్లు సక్రమంగా పనిచేయక ఆహారభద్రత కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నా అధికార యంత్రాంగం ఇంకా సరిచేయకపోవడం గమనార్హం. ఈనెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. మూడు నెలల బియ్యం ముందస్తుగా అంటే ఒక యూనిట్‌కు 18 కిలోల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే బియ్యం కోటాలకు ఒకేసారి వేలిముద్రలు వేస్తే పనిచేయడం లేదు. వేర్వేరుగా ఆరుసార్లు మిషన్‌పై నొక్కాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ పాస్ సర్వర్లు మొరాయిస్తుండడంతో మరింత జాప్యం అవుతోంది. 15 నిమిషాలకు ఒక కార్డుదారుని వేలిముద్రల ప్రక్రియ పూర్తవుతుండడంతో గంటకు నాలుగైదు కార్డులకు మించి నమోదు చేయలేని పరిస్థితి. దీంతో పనులు పక్కన పెట్టి జనాలు గంటల తరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కోటా పంపిణీలో జాప్యం కారణంగా పలు షాపులు తెరిచేందుకు దుకాణదారులు జంకుతున్నారు. ఈపాస్ సర్వర్ మిషన్ ఇబ్బందులు తొలగించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశం సత్తా చాటింది



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: ఆపరేషన్ సిందూర్‌తో మన దేశం బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో మనం సైతం దేశంకోసం అనే నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చేవెళ్లలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మన దేశ సైనికుల వీరోచిత పోరాటానికి మద్దతు తెలుపుతూ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఉండే వాళ్లు దేశం నాశనం కోరితే ఇక్కడ ఉండే హక్కు లేదన్నారు. భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు తెలపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, మొయినాబాద్ అధ్యక్షుడు శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి.. ఆసక్తి



మాడ్గులలో పత్తి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

- తెల్ల బంగారంపై వైపు మొగ్గు చూపుతున్న కర్షకులు
- ఈ ఏడాది జిల్లాలో లక్షన్నర ఎకరాలకు పైగా అంచనా
- ఇప్పటికే పొలాలను సిద్ధం చేసి ఉంచిన రైతులు
- అవసరం మేరకు విత్తనాల నిల్వ
- నకిలీని అరికట్టడానికి వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా

యాచారం: తెల్ల బంగారం సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా పత్తి దిగుబడితో మంచి ఆదాయం పొందారు. ఈ ఏడాది సైతం సాగుకు దృష్టి సారిస్తున్నారు. పక్షం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పొలాలను దున్ని విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధం చేసి ఉంచారు. వర్షాలు కురిస్తే చాలు వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి రెడీ అయ్యారు. జిల్లాలో గతేడాది లక్ష 20 వేల ఎకరాల వరకు పత్తి సాగైంది. మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, యాచారం, ఆమనగల్లు, యాచారం, షాద్‌నగర్, నందిగామ, మహేశ్వరం, కందుకూరు తదితర మండలాల్లో గణనీయంగా సాగు చేశారు. గతేడాది ధర మార్కెట్లో రూ.7,400కు (సీసీఐ నిర్ణయించిన ప్రకారం) పైగా డిమాండ్ పలికింది. సాగు చేసిన రైతులకు రూ.లక్షల్లో లాభాలు కలిసొచ్చాయి. వర్షాలు అదునులో కురవడంతో దిగుబడికి ఢోకా లేకుండా పోయింది. దీంతో ఈ ఏడాది అదనంగా సాగు చేసే యోచనలో ఉన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే విత్తనాలు విత్తారు.

450 కేంద్రాల్లో విత్తనాల కిట్స్ నిల్వ

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా లక్షన్నర ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. విస్తీర్ణానికి తగ్గట్టు విత్తనాలు నిల్వ చేసి ఉంచింది. సీడ్స్ లైసెన్స్‌లున్న 450 కేంద్రాల్లో కిట్స్ నిల్వ ఉంచింది. దాదాపు 4 లక్షల విత్తనాల కిట్స్ అవసరం ఉంటాయని ముందు జాగ్రత్త చర్యగా రెండున్నర లక్షల నాణ్యమైన కిట్స్ సిద్ధం చేసింది. మరో లక్ష కిట్స్ వెంటనే తెచ్చుకునేలా ఆర్డర్ పెట్టుకోవాలని డీలర్లకు సూచించింది. విత్తనాల ప్యాకెట్ల ధర, విక్రయాల స్టాక్ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపింది. విత్తనాల ప్యాకెట్లపై ఉన్న ధర ప్రకారమే విక్రయించాలని, కొనుగోలు చేసిన రైతులకు వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

నకిలీ కట్టడిపై ప్రత్యేక బృందాలు

జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశ ఉందని అంచనావేసిన వ్యవసాయ శాఖ నకిలీ విత్తనాలు కూడా భారీగా మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు గుర్తించింది. ఇందు కోసం జిల్లా స్థాయిలో రెండు, డివిజన్ స్థాయిలో ఆరు, మండల స్థాయిలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసింది. ఇప్పటికే మండల స్థాయిలో వ్యవసాయాధికారి, పోలీస్ శాఖ, సీడ్స్ అధికారుల ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు అరికట్టే విషయమై సూచనలు చేసింది. గతేడాది కొన్ని మండలాల్లో లైసెన్స్‌డ్ పొందిన డీలర్లే అధిక ఆదాయం ఆశతో నకిలీ విత్తనాలు విక్రయించడంతో పాటు కొరత సృష్టించి ప్యాకెట్లపై ఉన్న ధర కంటే రెండింతలు వసూలు చేశారు. అప్పట్లో అధికారులు కూడా డీలర్లతో కుమ్మక్కైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది అలాంటి ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అయినా అనేక గ్రామాలకు పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

54 ఎకరాల్లో సాగుకు రెడీ



గతేడాది పత్తి దిగుబడితో మంచి లాభాలు పొందాను. ఈ ఏడాది 54 ఎకరాల్లో సాగుకు సిద్ధమయ్యాను. పక్షం రోజుల క్రితం కురిసిన వర్షానికి పొలాన్ని దున్ని ఉంచాను. విత్తనాల కొనుగోలు, పొలాన్ని దున్నించడం కోసం ఇప్పటికే రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశాను.

– బత్తుల కొండల్‌రెడ్డి, రైతు, మాడ్గుల

విస్తీర్ణం పెరిగే అవకాశం



ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీనికి తగ్గట్లు విత్తనాల కిట్స్ నిల్వ చేసేలా చర్యలు చేపట్టాం. కొరత రానివ్వం. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– బి.నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఔటర్.. ఔరా!

- ఓఆర్ఆర్ చుట్టూ అభివృద్ధికి సర్కారు అడుగులు
- ఐటీ, పరిశ్రమలకు స్థలాల కేటాయింపునకు కసరత్తు
- సెజ్ తరహాలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కంపెనీలు, నివాసాలు ఒకేచోట ఉండేలా ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరానికి మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలతో అనుసంధానంగా ఉంటూ ఇతర నగరాలకు వెళ్లేందుకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో నిర్మితమైన ఔటర్ చుట్టూ ఐటీ, పరిశ్రమల స్థాపనకు శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి ప్రాంతాల్లో సెజ్ తరహాలో కంపెనీలకు స్థలాలను కేటాయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో సంస్థలకు చేరువలో నివాసాలు ఉండేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో నగరాభివృద్ధి విస్తరించడంతో పాటు వాక్ టు వర్క్ విధానంలో ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.

కనిష్టంగా వెయ్యి ఎకరాలు

ఔటర్ చుట్టూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని ప్రాంతాలు, విమానాశ్రయానికి దగ్గరగా ఉండే మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో ఒక్కోచోట వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా



భూములను సేకరించాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. మరోవైపు గతంలో ఏవైనా సంస్థలకు స్థలాలు ఇచ్చి అవి ఇంకా కార్యకలాపాలు ప్రారంభించకపోతే వాటిని వెనక్కి తీసుకునే మార్గాలను కూడా అన్వేషిస్తున్నారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

వాక్ టు వర్క్ తరహాలో..

ఔటర్ చుట్టూ రానున్న పరిశ్రమలు వాక్ టు వర్క్ విధానంలో ఉండాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. కంపెనీలకు చేరువలోనే నివాసాలు ఉండేలా ప్రణాళికలు చేస్తున్నారు. స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) తరహాలో ఒకేచోట 300 ఎకరాల భూములు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసం ఉండేందుకు వీలుంటుందని రెవెన్యూ అధికారుల భావిస్తున్నారు. ఇందుకోసం 300 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించాలని నిర్ణయించారు. రోడ్లు, తాగునీరు, మురుగు నీటి వ్యవస్థలను అందుబాటులో ఉండేలా ప్రణాళికలు చేస్తున్నారు.

అభివృద్ధి విస్తరణ

ఇప్పటికే ఫాక్స్‌కాన్ సంస్థ రంగారెడ్డి కలెక్టరేట్‌కు సమీపంలో యాపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీంతో పాటు మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఎలక్ట్రానిక్ సిటీ బాగా ప్రాచుర్యం పొందింది. ఈ రెండు పరిశ్రమలతో పాటు షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐటీ, పరిశ్రమల హబ్‌లలో పరిశ్రమలు, ఐటీ సంస్థలతో పాటు వాటికి సమీపంలో విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే నాలుగైదేళ్లలోనే అక్కడ కూడా అభివృద్ధి పెరిగి నగరాభివృద్ధి మరింత విస్తరించే అవకాశముంది.

భూ సమస్యలను పరిష్కరించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



యాచారం: తమ్మలోనిగూడలో మాట్లాడుతున్న యాదయ్య

యాచారం/మంచాల: రెవెన్యూ సదస్సులతోనైనా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య ఆకాంక్షించారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడ గేట్ వద్ద మంగళవారం నిర్వహించిన మండల కమిటీ, గ్రామ శాఖ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాడు బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్, నేడు కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు ఏ మేరకు న్యాయం జరుగుతుందో అనుమానంగా ఉందన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా పల్లెల్లో రోజురోజుకు భూ సమస్యలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. భూ సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడిందన్నారు. ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఫార్మాసిటీ గ్రామాల్లోని నిషేధిత జాబితాలో ఉన్న 2,200 ఎకరాల పట్టా భూముల రికార్డులను రైతుల పేరుపై నమోదు చేయాలని తిరుగుతున్నా చలనం లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, వెంకటయ్య, తావునాయక్, జగన్, బాల్‌రాజ్, భూషణ్, రమేష్, యాదగిరి, శ్రీరాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలివ్వండి

మంచాల మండలంలోని చీదేడ్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ వెంకటప్రసాద్‌కు పలు సమస్యలపై సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 97, 119 సర్వేనంబర్లలోని భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులకు నేటికీ పట్టాలు లేకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు శ్యామ్ సుందర్, నర్సింహ, వెంకయ్య, సత్తయ్య, వెంకటేష్, యదేశ్వర్, జంగయ్య, రామకృష్ణ, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



చంద్రశేఖర్ మృతదేహం

మొయినాబాద్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మృగవని పార్కు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన వడ్డె చంద్రశేఖర్ (38) సోమవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నగరానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో మృగవని పార్కు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడ్డ అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ పరీక్షలు తప్పనిసరి



అగ్గనూరులో టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాలాల: రెండు వారాల పాటు ఎవరికైనా దగ్గు ఉంటే తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని అగ్గనూరు ఆరోగ్య ఉప కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి రుబియానాజ్‌తో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. రెండు వారాల పాటు దగ్గు, సాయంత్రం వేళ జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, చాతిలో నొప్పిలాంటి లక్షణాలు కలిగిన 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారికి స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 115 మందికి ఎక్స్‌రే తీసి వ్యాధిని గుర్తించినట్లు చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి ఆరునెలల పాటు ఉచితంగా మందులతో పాట పౌష్టికాహారం కోసం నెలకు రూ. వెయ్యి చొప్పున రోగి ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎస్ సుశీల, సూపర్‌వైజర్లు శోభారాణి, పల్లె దవాఖాన వైద్యురాలు భువనేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, టీబీ సూపర్‌వైజర్ రహత్ అలీ, ఏఎన్ఎంలు వీరమణి, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్‌కు రిమాండ్

మీర్‌పేట: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసిన మీర్‌పేట పోలీసులు మంగళవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న రమావత్ రవీందర్ (21) డిగ్రీ చదువుతున్నాడు. మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించాలని భావించాడు. ఈక్రమంలో గత నెల 31న మీర్‌పేట మంత్రాల చెరువు వద్ద ఉదయం వాకింగ్ చేస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు రవీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి 32 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరుగా రెయిన్ వాటర్, సీవరేజ్ లైన్లు

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సీవరేజ్, వాననీటి కాలువ అనుసంధానం పాయింట్లను గుర్తించి రెండు లైన్లను వేర్వేరుగా నిర్మించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం మలక్‌పేట్‌లోని నల్గొండ చౌరస్తాలో సీవరేజ్ మరమ్మతు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు దశాబ్దాల క్రితం నాటి సీవరేజ్ లైను శిథిలమైపోవడంతో అవుట్‌లెట్ లేక వర్షం కురిసిన సమయాల్లో సీవరేజ్ రహదారిపై పొంగుతున్నట్టు గుర్తించారు. సీవరేజ్ లైన్లు ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలించారు. మలక్‌పేట్ ఆర్‌యూబీ వరకు సీవరేజ్ లైన్ల నిర్మాణం చేపట్టడానికి అధికారులతో చర్చించారు. కొత్త సీవరేజ్ లైన్ల వల్ల తాత్కాలికంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉంటుందని అన్నారు. అలాగే సమీపంలోని భవనాల నుంచి ఉత్పన్నమయ్యే సీవరేజ్‌ను ఎక్కడికక్కడే కాకుండా ఒకే అవుట్‌లెట్ వద్ద అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే సమీపంలోని అన్ని సీవరేజ్ లైన్లను, మ్యాన్ హోళ్లను డీసిల్టింగ్ చేసి మురుగు పొంగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారంకోసం ఇరు శాఖల అధికారులు సర్వే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం నాగేందర్, జీఎం ఇతర అధికారులు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

డీపీతో టోపీ!

- దుబాయ్‌లో ఉన్న వ్యక్తి డిస్‌ప్లే పిక్చర్‌తో వాట్సాప్
- దాని ఆధారంగా ఇక్కడ ఉన్న సోదరుడికి సందేశం
- అక్కడ నుంచి నగదు పంపినట్లు నకిలీ రసీదు సృష్టి
- వీసా ఏజెంట్ పేరిట కథనడిపి రూ.1.9 లక్షలు స్వాహా



సాక్షి, సిటీబ్యూరో: రాజకీయ నాయకులు, అధికారులు, స్నేహితులు, కుటుంబీకుల ఫొటోలు వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్లుగా ఏర్పాటు చేసుకుని, అత్యవసరమంటూ డబ్బు గుంజిన డీపీ ఫ్రాడ్స్ ఇప్పటి వరకు చూశాం. ఇప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్న సైబర్ నేరగాళ్లు ముందు డబ్బు పంపినట్లు నమ్మించి, నకిలీ రసీదులు పంపి, ఆపై అందినకాడికి దండుకుంటున్నారు. ఈ సరికొత్త ఫ్రాడ్ రూ.1.9 లక్షలు కోల్పోయిన బాధితుడి తరఫున ఆయన భార్య మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి సోదరుడు దుబాయ్‌లో ఉంటారు. అతడి ఫొటోలు వాట్సాప్ డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు గత శుక్రవారం నగర వాసికి సందేశం పంపారు. అది తన సోదరుడి నుంచే వచ్చినట్లు భావించిన ఆయన అనేక అంశాలపై చాటింగ్ చేశారు. తాను త్వరలోనే తిరిగి రానున్నానని చెప్పిన నేరగాడు తన వద్ద ఉన్న కొంత నగదు పంపుతున్నట్లు చెప్పాడు. దీనికోసం అంటూ నగరవాసి నుంచి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిసేపటికి వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆ ఖాతాలోకి భారీ మొత్తం జమ చేసినట్లు సృష్టించిన నకిలీ రసీదు షేర్ చేశాడు. ఆ మొత్తం 24 గంటల్లో బ్యాంకు ఖాతాలోకి వచ్చి చేరుతుందని నమ్మించాడు. ఇది జరిగిన దాదాపు గంట తర్వాత తాను భారత్ తిరిగి వచ్చే ప్రయత్నాల్లో ఉండగా దుబాయ్ ఎంబసీ అధికారులు అడ్డుకున్నట్లు సందేశం పంపాడు. వీసా ఇబ్బందుల కారణంగా ఇలా జరిగిందని, ఓ ఏజెంట్ మిమ్మల్ని సంప్రదిస్తాడని, అతడు చెప్పినట్లు చేస్తే తాను బయటకు వస్తానని నమ్మించాడు. కొద్దిసేపటికి వీసా ఏజెంట్ మాదిరిగా ఫోన్ చేసి మాట్లాడిన మరో వ్యక్తి వీసా పునరుద్ధరణ కోసం రూ.లక్ష చెల్లించాలంటూ బ్యాంకు ఖాతాల్లో వేయించుకున్నాడు. ఆపై వీసా పని పూర్తయిందని, విమాన టిక్కెట్లు ఖరీదు చేయాలంటూ మరో రూ.90 వేలు బదిలీ చేయించుకున్నాడు. చివరకు దుబాయ్‌లో ఉన్న స్నేహితుడిని నేరుగా సంప్రదించిన నగర వాసి తాను మోసపోయినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు బాధితుడి భార్య సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

మళ్లీ పోలీస్ చేతికి జేమ్స్ స్ట్రీట్ భవనం

- రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ త్వరలో అక్కడికి తరలింపు
- సందర్శించిన సీపీ సీవీ ఆనంద్



రాంగోపాల్‌పేట్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

బన్సీలాల్‌పేట్: హెచ్ఎండీఏ మరమ్మతులు చేపట్టిన జేమ్స్ స్ట్రీట్ భవనాన్ని పోలీస్ శాఖకు అప్పగించారని, త్వరలోనే రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ ఇక్కడికి వస్తుందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని రాంగోపాల్‌పేట్ పురాతన పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఉత్తర మండలం డీసీపీ రష్మి పెరుమాల్, నగర ట్రాఫిక్ డీసీసీ రాహుల్ హెగ్డే తదితరులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడారు. రాంగోపాల్‌పేట్ పాత పోలీసు స్టేషన్‌కు హెచ్ఎండీఏ మరమ్మతులు నిర్వహించి బ్రహ్మాండంగా తయారు చేశారన్నారు. సదరు స్టేషన్‌ను తిరిగి తమకు అప్పగించడం జరిగిందని తెలిపారు. త్వరలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. జేమ్స్ స్ట్రీట్ భవనం 1870 సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి 2016 వరకు సుదీర్ఘ కాలం రామ్‌గోపాల్‌పేట్ పోలీసు స్టేషన్ ఇక్కడే కొనసాగింది. ఆ తర్వాత మరమ్మతుల కోసం తొమ్మిదేళ్ల క్రితం హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకుని..ఇప్పుడు అప్పగిస్తోంది. రానున్న కొద్ది రోజుల్లో రాంగోపాల్‌పేట్ పోలీసు స్టేషన్‌కు సంబంధించిన వస్తువులను తిరిగి ఇక్కడి తీసుకవచ్చి పోలీసు కార్యకలాపాలు సాగించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పురాణి హవేలిలోని సిటీ పోలీసు కమిషనర్ కార్యాలయం మరమ్మతులు పూర్తి కావచ్చాయని, త్వరలో ఈ భవనాన్ని ప్రారంభించి అక్కడి నుంచీ నగర పోలీసు కార్యకలాపాలు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

నకిలీ వైద్యుడి అరెస్టు

సనత్‌నగర్: ఎలాంటి విద్యార్హతలు లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ..అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఓ నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా అన్నానగర్‌లో ఓ నకిలీ వైద్యుడు ఆస్పత్రి నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ వరలక్ష్మీ నేతృత్వంలో ఇతర పోలీసు సిబ్బంది కలిసి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. అన్నానగర్‌లో జి.మహేందర్ అనే వ్యక్తి క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద ఎటువంటి విద్యార్హతకు సంబంధించిన పత్రాలు లేకపోగా నిజమైన వైద్యుడి మాదిరిగానే మెడలో స్టెతస్కోపు, ఆస్పత్రిలో రక్తపోటు గుర్తించే యంత్రం, థర్మామీటరు, మందులు రాసే చీటీల పుస్తకం, మధుమేహ పరీక్షా యంత్రం, పల్స్ ఆక్సోమీటర్, ఇతర ఔషధాలను క్లినిక్‌లో గుర్తించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన మహేందర్ ఎటువంటి విద్యార్హతలు, పత్రాలు లేకున్నా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యం చేస్తూ, మందులను రాసిస్తున్నారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి క్లినిక్‌లో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీదారుడి అరెస్టు

చాంద్రాయణగుట్ట: నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై మంగళవారం సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బండ్లగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.1.40 లక్షలు విలువ చేసే 870 కేజీల అల్లం వెల్లులి పేస్టు, 4 కేజీల టైటానియం డయాక్సైడ్, 16 కేజీల మోనో సిట్రేట్, 4 కేజీల కలర్ టర్మరిక్ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ పటేల్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫైసల్ స్థానికంగా గుట్టు చప్పుడు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నకిలీ అల్లం వెల్లులి పేస్టు తయారు చేస్తున్నాడు. ఎఫ్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్ పేరిట అవసరమైన దుకాణదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు.

లిఫ్ట్ గుంతలో పడి మహిళ మృతి

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లా దేవల్గాన్ గ్రామానికి చెందిన జైషీలా(39) భర్త కుంరాజు నగరానికి వచ్చారు. అంజయ్యనగర్‌లో ఫ్లాట్‌నెంబర్ 74లో నిర్మాణంలో ఉన్న భవనంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి లిఫ్ట్ గుంతలో పడింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం.. చెట్టును ఢీకొన్న రెడిమిక్స్ లారీ



గచ్చిబౌలి: అతి వేగంగా వస్తూ రెడిమిక్స్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లను ఢీ కొట్టింది. అటువైపు వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం ఏసీసీ రెడిమిక్స్ లారీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో ఎస్‌బీఐ ఎదురుగా చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, సుమోటోగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులులారీని తొలగించారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లతో విదేశాలకు

ఓ కన్సల్టెన్సీ నిర్వాకం

- అమెరికా నుంచి తిరిగొచ్చిన విద్యార్థి సర్టిఫికెట్ పరిశీలనలో బయటపడ్డ వైనం
- కేరళలో తయారీ.. హైదరాబాద్‌లో విక్రయం
- ఇద్దరి అరెస్ట్..ఒకరి పరారీ



నకిలీ సర్టిఫికెట్లు చూపుతున్న శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐ బాలరాజు



నకిలీ సర్టిఫికెట్ కేసులో రిమాండ్‌కు తరలించిన ఇద్దరు నిందితులు

శంషాబాద్: అమెరికా నుంచి డిపోర్ట్ అయిన విద్యార్థి సర్టిఫికెట్ నకిలీదిగా తేలడంతో హైదరాబాద్‌లోని ఓ నకిలీ సర్టిఫికెట్ విక్రయిస్తున్న కన్సెల్టెన్సీ గుట్టు రట్టింది. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లా పారేపల్లిగూడెం గ్రామానికి చెందిన పకీరు గోపాల్‌రెడ్డి 2018లో మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించి ఏడాదిన్నర కిందట అమెరికాలోని వెబ్‌స్టర్ వర్సిటీలో 28 వేల డాలర్ల ఫీజు చెల్లించి ఉన్నత చదువులో ప్రవేశం పొందాడు. 15 నెలలు చదివిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చి ఐదు నెలలు ఇక్కడే ఉన్నాడు. నాలుగురోజుల కిందట అమెరికా వెళ్లిన అతడిని అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు యునివర్సిటీలో ఇన్‌యాక్టివ్ విద్యార్థిగా గుర్తించి స్వదేశానికి తిప్పిపంపారు. దీంతో తిరిగి వచ్చే క్రమంలో ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అతడి వీసాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలించగా నకిలీ సర్టిఫికెట్ గుట్టు బయటపడింది. దీంతో అతన్ని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

పదిహేను మందికి పైగా..

నకిలీ సర్టిఫికెట్లపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు గోపాల్‌రెడ్డిని విచారించగా బీఎన్‌రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో ఉన్న ధనలక్ష్మీ ఒవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో రూ.80 వేలకు డిగ్రీ సర్టిఫికెట్ కొనుగోలు చేసినట్లు చెప్పాడు. సీఐ బాలరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సిద్దేశ్వర్ పోలీసుల బృందం ధనలక్ష్మీ ఒవర్సీస్ సంస్థపై దాడులు చేశారు. సంస్థ నిర్వాహకుడు కాతోజు అశోక్‌ను అరెస్ట్ చేయడంతో పాటు అక్కడ ఉన్న మధురై కామరాజ్, ఉస్మానియా వర్సిటీలకు చెందిన 17 నకిలీ డిగ్రీ, ప్రొవిజినల్ మార్కుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన విద్యార్హత లేకుండా విదేశీ విద్యనభ్యసించాలనుకునే వారు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తూ నకిలీ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు గుర్తించారు. పదిహేనుమందికిపైగా నకిలీ సర్టిఫికెట్లతో విదేశీ విద్యకు వెళ్లినట్లు విచారణలో అశోక్ వెల్లడించాడు. కేరళకు చెందిన వ్యక్తికి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేలు ఇస్తే..అతడే సర్టిఫికెట్లు తయారుచేసి పంపిస్తున్నట్లు తెలిపాడు. అశోక్ నుంచి నకిలీ సర్టిఫికెట్లతో పాటు వివిధ బ్యాంకులకు చెందిన నకిలీ స్టాంపులు, నకిలీ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌రెడ్డి, అశోక్‌లను రిమాండ్‌కు తరలించగా కేరళకు చెందిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

'ఆరోపణల్లో వాస్తవం లేదు'



మాట్లాడుతున్న బల్‌దేవ్‌రెడ్డి

తుర్కయంజాల్: దళితులను కులం పేరుతో దూషించానంటూ తనపై చేసిన ఆరోపణలు, ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు కందాల బల్‌దేవ్‌రెడ్డి అన్నారు. శనివారం కొహెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ పరిధి కొహెడలోని సర్వే నంబర్ 956లో తనకు ఓపెన్ ప్లాట్ ఉండటంతోనే ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌లో ప్రధాన కార్యదర్శి పదవిని తీసుకున్నాని వివరణ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా గ్రామంలో గత ముప్పై ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. తాను ఎవరి హక్కులకు భంగం కలిగించలేదని స్పష్టంచేశారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

అగ్రోమెట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కే బల్

కేశంపేట: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తూ డబ్బులు, సమయాన్ని ఆదా చేసుకోవాలని డ్రైలాండ్ అగ్రికల్చర్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆగ్రోమెట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కే బల్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ శివారులోని రైతు వేదికలో మంగళవారం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ వ్యవసాయం సాగు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. వాతావరణంలో మార్పులతో స్థిరమైన పంటల సాగు చేయడం ద్వారా జరిగే నష్టాలను తెలుసుకోవాలన్నారు. పంటల సాగులో ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటించాలని తెలిపారు. రైతులు సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం నుంచి డాక్టర్ సుధీర్, డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ సుప్రియ, డాక్టర్ భార్గవి, డ్రైలాండ్ అగ్రికల్చర్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభ, డాక్టర్ నాగశ్రీ, షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు, ఏఈఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన కొకైన్ పట్టివేత

- మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు
- తిరుపతి నుంచి కొకైన్, ఎఫిడ్రీన్ తదితర డ్రగ్స్ హైదరాబాద్‌కు తరలింపు
- ప్రధాన నిందితుడు ఏపీలో పోలీసు శాఖ ఉద్యోగి
- రూ.కోటి విలువచేసే కొకైన్ స్వాధీనం
- ప్రధాన నిందితుడు గుణశేఖర్ పరారీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న కొకైన్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

జీడిమెట్ల: తిరుపతి నుండి హైదరాబాద్‌కు కొకైన్, ఇఫిడ్రిన్ వంటి మత్తు పదార్థాలు తీసుకువచ్చి అమ్మేందుకు ప్రయత్నించిన ఐదుగురు వ్యక్తుల ముఠాను బాలానగర్ ఎస్ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఏపీలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు గుణశేఖర్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద రూ.కోటి విలువచేసే 820 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీసీపీ ఎన్.కోటిరెడ్డి, ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్ తదితరులు కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రధాన నిందితుడు ఏపీలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్..

తిరుపతికి చెందిన గుణశేఖర్ ఏపీలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని స్నేహితుడు ఉన్నం సురేంద్రకు డబ్బు ఆశచూపి మే 29వ తేదీన 820 గ్రాముల కొకైన్ ఇచ్చి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు పంపించాడు. గుణశేఖర్ చెప్పినట్లుగానే సురేంద్ర కొకైన్ తీసుకుని గుంటూరు మీదుగా నగరంలోని కూకట్‌పల్లికి చేరుకున్నాడు. ఇక్కడ సురేంద్ర తన మనుషులైన బాపట్ల జిల్లాకు చెందిన దోతిరెడ్డి హరిబాబురెడ్డి, దేవరాజు యేసుబాబులను హైదరాబాద్ రప్పించాడు. అదేవిధంగా సురేంద్ర చేగూడి, మెర్సి మార్గరెట్, షేక్ మస్తాన్ వలీలను సైతం పిలిపించుకున్నాడు. అందరూ కలిసి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో కలుసుకున్నారు.

జూన్ 2న పోలీసులు బిజీగా ఉంటారని

రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు జూన్2న పోలీసులు బిజీగా ఉంటారని..ఆ రోజే కొకైన్ అమ్మేందుకు పథకం వేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి భాగ్యనగర్ వైపు వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా కొకైన్ లభించింది. వెంటనే ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి విచారించగా అసలు బండారం బయటపెట్టారు. అసలు కొకైన్ వీరికి ఎక్కడ నుండి వచ్చిందనే విషయం తెలియలేదు. ప్రధాన నిందితుడు గుణశేఖర్ పోలీసులకు పట్టుబడితే అసలు విషయాలు బయటకు వస్తాయి. సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ రవికుమార్, ఇన్స్‌పెక్టర్ రాజేశ్, బాలానగర్ ఎస్ఓటీ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, ఎస్సై కట్కం గౌతం పాల్గొన్నారు.